ప్రజాశక్తి

శుక్రవారం 9 మే 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

బాపట్ల కలెక్టర్‌కు గవర్నర్ ప్రశంస

- రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే బాపట్లకు ప్రథమ స్థానం
- గవర్నర్ అబ్దుల్‌నజీర్ ద్వారా అవార్డు అందుకున్న వెంకటమురళి

గవర్నర్ అబ్దుల్‌నజీర్ ద్వారా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా కలెక్టర్ జె.వెంకటమురళి బాపట్లలో చేపడుతున్న సేవలను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ▶ 2లో

'బుద్ధం శరణం గచ్ఛామి' నాటకంలో ఓ సన్నివేశం

అంబేద్కర్ ఆలోచనలు అనుసరణీయం

ఆకట్టుకున్న 'బుద్ధం శరణం గచ్ఛామి' నాటకం

▶ 8లో

సిఐ స్వర్ణలతే ఎసిబి నకిలీ ఎస్‌పి

▶ 3లో

రజకుల కోసం మోడల్ దోబీ ఘాట్‌లు

వాషర్‌మెన్-రజక కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ సావిత్రి

మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో రజకుల కోసం మోడల్ దోబీఘాట్ నిర్మాణం చేపట్టాలని సిఎం చంద్రబాబును కోరినట్లు రాష్ట్ర వాషర్‌మెన్–రజక కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ సావిత్రి చెప్పారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని తెలిపారు. స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయ ఆవరణలో రజక ఉద్యోగులు, రజక వృత్తిదారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సావిత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలలో రజకులకు మాత్రమే దోబీ పనులు అప్పగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈపాటికే ఇందుకు సంబంధించి జీవోలు విడుదల అయినట్లు తెలిపారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ ద్వారా ప్రతి రజక వృత్తిదారు డికి కార్మిక శాఖలో గుర్తింపు కార్డుతో పాటు జీవిత బీమా వర్తింప చేస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్ కేంద్రాల్లో రజకుల సంక్షేమంతో పాటు ఎటువంటి దాడులు జరుగకుండా జాయింట్ యాక్షన్ కమిటీ నియమించేలా ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. రాష్ట్రంలో కార్పొరేషన్ ద్వారా రజకుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మార్కాపురం నియోజకవర్గంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా స్థానిక నాయకులు చూడాలన్నారు. ఈ సందర్భంగా సావిత్రిని రజక ఉద్యోగులు, రజక వృత్తిదారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాషర్‌మెన్–రజక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కనిగిరి బాలవెంకటరమణ, రజక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పేరూరి వెంకటేశ్వర్లు, అగ్రహారం శ్రీనివాసులు, నాయకులు తుంబేటి సుబ్రహ్మణ్యం, పగడాల నారాయణ, రాజా శ్రీకాంత్, పోలిశెట్టి తిరుపతయ్య, దేవలూటి శంకర్, బిజెపి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పివి కృష్ణారావు, బిజెపి నాయకులు శాసనాల సరోజిని, బొంతల కృష్ణ, మద్దెల లక్ష్మిలతో పాటు రజక ఉద్యోగులు, రజక వృత్తిదారులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం, పొట్టిపల్లె గ్రామంలో మొహిద్దీన్‌పురం గ్రామానికి చెందిన దాసరి వీరయ్య కుమార్తె వెంకట ఉమా మహేశ్వరి, పొట్టిపల్లె గ్రామానికి చెందిన రాయపు గుర్రప్పడు కుమారుడు ప్రసాద్‌ల వివాహ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతు సంఘం అధ్యక్షులు అనుపమ వీరశేఖర్, నంది శ్రీనివాసులు, మండల నాయకులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు గ్రామంలో జరుగుచున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో డి సురేష్‌బాబు గురువారం పరిశీలించారు. టార్గెట్ ప్రకారం ఉపాధి పనులకు కూలీలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోజుకు 307 రూపాయలు వేతనం తగ్గకుండా కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంలో 'చల్లా' అర్ధ సెంచరీ

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామానికి చెందిన చల్లా అశోక్ రెడ్డి గత 13 సంవత్సరాల నుంచి రక్తదానం చేస్తూ రక్తదానంపై అవగాహన కల్పిస్తూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదానం చేపిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పట్టణం జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్‌లో ఓ మహిళకు అత్యవసరంగా గుండె ఆపరేషన్ కోసం రక్తం అవసరం కాగా పేషెంట్ కుటుంబ సభ్యులు 'మేమున్నాం' సేవాసమితి అధ్యక్షులు చల్లా అశోక్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన అశోక్‌రెడ్డి 50వసారి రక్తదానం చేసి పేషెంట్ ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా పలువురు 'మేమున్నాం' సేవాసమితి అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి చేస్తున్న సేవలను అభినందిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలలో ఇంటర్‌నెట్ పనిచేయక ఇక్కట్లు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

చెట్టుపై ఏర్పాటు చేలసిన ఎయిర్టెల్ యాంటినా

మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలలో ఇంటర్నెట్ పనిచేయక పోవడంతో కార్యాలయాల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఏపీ స్వాన్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. అయితే దాదాపు నెలరోజులు పైగా ఈ ఏపీ స్వాన్ ఇంటర్నెట్ పనిచేయకపోవడంతో కార్యాలయాల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొనేందుకు అధికారులంతా ప్రతి సోమవారం కనిగిరి కి వెళ్ళాల్సి వస్తున్నది. ఈ పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా ఉందంటూ అధికారులు వాపోతున్నారు. తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది 5000 వెచ్చించి ఎయిర్టెల్ వారి మోడెం ను కొనుగోలు చేసి భవనం పైన యాంటీనా ను ఏర్పాటు చేసుకొని ఇంటర్నెట్ ను వినియోగించు కుంటూ అవస్థలు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం, వెలుగు కార్యాలయం సిబ్బంది బిఎస్ఎన్ఎల్ వారి ల్యాండ్ లైన్ ఇంటర్నెట్ ను వినియోగించుకుంటూ అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పథకం కార్యాలయం, గృహ నిర్మాణ శాఖ కార్యాలయం సిబ్బంది తమ తమ సెల్ ఫోన్ లలో హాట్ స్పాట్ ద్వారా ఇంటర్నెట్ ను వినియోగించు కుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు మెరుగైన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి ఇబ్బందులు తీర్చాలని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, అధికారులు కోరుతున్నారు.

పొగాకు వేలం కేంద్రం సందర్శన

ప్రజాశక్తి- పొదిలి : మార్కెట్ సరళిని అనుసరించి రైతులు పొగాకు బేళ్లను తయారు చేసుకుని అమ్ముకోవాలని బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. విశ్వశ్రీ తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వేలం ప్రక్రియను పరిశీలించారు. పొగాకు లభిస్తున్న మార్కెట్ ధరలను స్వయంగా పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వశ్రీ మాట్లాడుతూ మార్కెట్ సరళికి అనుగుణంగా పొగాకు బేళ్లను అమ్ముకోవాలని సూచించారు. అనంతరం పలు కంపెనీల బయ్యర్ల, మేనేజర్ తోటి మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు కార్యదర్శి డి వేణుగోపాల్ మరియు దక్షిణ ప్రాంత తేలిక నేలల ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు, వేలం కేంద్రం నిర్వహణ అధికారిగిరిరాజకుమార్ పాల్గొన్నారు.

బాపట్ల కలెక్టర్‌కు గవర్నర్ ప్రశంస

(మొదటిపేజీ తరువాయి)

బాపట్ల జిల్లాను అగ్రగామిగా నిలిపినందుకు కలెక్టర్ జె వెంకటమురళికి అవార్డు, పతకాన్ని గవర్నర్ ప్రదానం చేశారు. గురువారం ఏపీ రాజభవన్‌లో గవర్నర్ ద్వారా కలెక్టర్ వెంకట మురళి అవార్డును అందుకున్నారు. గడిచిన ఏడాది కాలంలో బాపట్ల జిల్లాలో 1,200 మందిని రెడ్‌క్రాస్ సభ్యులుగా చేర్పించారు. సభ్యత్వ నమోదుతో రెడ్‌క్రాస్ సంస్థకు రూ.12 లక్షల ఆర్థిక వనరులను పెంచారు. దీంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడాన్ని గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల కృష్ణానది వరద విపత్తు సమయంలోనూ బాపట్ల జిల్లాలో ఎలాంటి ప్రాణహాని జరగకుండా ముందస్తు ప్రణాళికతో జాగ్రత్త చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. ఆ సమయంలో ప్రజలకు విశేషంగా సేవలందించినందుకు కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నుంచి రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ నారాయణ భట్టు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సంస్థకు అంకితం: కలెక్టర్

రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదుపై తనకు వచ్చిన అవార్డు, బంగారు పతకాన్ని ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, రెడ్ క్రాస్ సంస్థకు అంకితం చేస్తున్నానని కలెక్టర్ జె.వెంకటమురళి ప్రకటించారు. ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు, బంగారు పతకం అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని అధికారులు, సిబ్బంది, రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధుల సమష్టి కృషితోనే బాపట్లకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. వారంతా క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేయడంతోనే రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రజలకు విశేష సేవలందాయన్నారు. ముఖ్యంగా కష్ణానది వరద విపత్తు సమయంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, రెడ్ క్రాస్ సంస్థ అందించిన సేవలు మరువలేనవన్నారు. రెడ్ క్రాస్ సంస్థ సేవలు ఇక్కడ విస్తతమయ్యాయని, సభ్యత్వ నమోదులోనూ బాపట్ల జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచేలా కషి చేశారన్నారు. అందరి కషితోనే ఈ అవార్డు, బంగారు పతకం అందుకున్నానని, అందుకే వారికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎఇ ఎఒ మోహన్ రెడ్డి తెలిపారు. పిచ్చిరెడ్డి తోట, ఎన్‌టిఆర్‌కాలనీ, మీగడ ఓబులరెడ్డి వాటర్ ప్లాంట్, మర్రిపూడి స్టోన్ క్రషర్స్ ప్రాంతాలు, ఉప్పలపాడు, రాజుపాలెం గ్రామాల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

CHANGE OF NAME

I, GODUGULURI VENKATESHWARLU (Old name), S/o GODUGULURI VENKATA NARASAIAH resident of H.No.31-53-835, Near Venkata Ramana Hospital right Side, Venkateswara Nagar, Ongole, Prakasam District - 523 002 , Andhra Pradesh I, have Changed my name as GODUGULURI VENKATESWARLU (New Name) S/o GODUGULURI VENKATA NARASAIAH Hereafter my name is known as GODUGULURI VENKATESWARLU (New Name) S/o GODUGULURI VENKATA NARASAIAH

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా, ఒంగోలు టౌన్, రాజాపానగల్ రోడ్డు, డోర్ నెం.4–1–258 నివాసి అయిన **సయ్యద్ చాంద్‌బాషా గారి భార్య సయ్యద్ సఫియ బి గారు** మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిస్టర్ కాబడిన దఖలు దస్తావేజు నెంబర్ **7380 ఆఫ్ 2022** ద్వారా పొంది సంపూర్ణ హక్కులతో అనుభవిస్తున్నారు. సదరు దస్తావేజుకు ఒక లింక్ దస్తావేజు అయిన ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిస్టర్ కాబడిన దస్తావేజు నెంబర్ **1472 ఆఫ్ 1963** పోగొట్టుకున్నారనీ, సదరు విషయమై ఒంగోలు 2టౌన్ పోలీస్ స్టేషన్‌లో కంప్లంట్ ఇచ్చి యున్నారనీ, సదరు పోలీసు వారు సదురు పోయిన దస్తావేజు దొరకలేదని సర్టిఫికేట్ ఇచ్చియున్నారనీ, మరియు నా క్లయింట్ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని Can Fin. Homes Ltd., ఒంగోలు బ్రాంచ్ వారికి తాకట్టు పెట్టి ఋణము పొందియున్నారనీ తెలియజేసియున్నారు. ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎవరికైననూ ఏ విధమైన హక్కులు గానీ, సదరు ఋణముపై అభ్యంతరములు గానీ లేదా సదరు పోయిన దస్తావేజు దొరికిన యెడల గానీ లిఖిత పూర్వకముగా తగిన దస్తావేజులతో ఈ నోటీసు ప్రచురించిన **(10) దినవములు** లోపు ఈ క్రింది సంతకందారును సంప్రదించగలరు. లేని యెడల ఎవరికీ ఏ విధమైన అభ్యంతరములు గానీ, హక్కులు గానీ లేవనీ, సదరు పోయిన దస్తావేజు దొరకలేదని భావించి, మా క్లయింట్ ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిపై Can Fin. Homes Ltd., ఒంగోలు వారి వద్ద నుంచి అడిసినల్ ఋణము పొందగలరు మరియు లావాదేవీలు జరుపగలరు. గడువు తరువాత వచ్చు అభ్యంతరములు నా క్లయింట్‌ను గానీ, తదుపరి జరుగు లావాదేవీలను గానీ, ఋణదాతను గానీ బద్ధవరచజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్ : ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ యిలాకా, ఒంగోలు టౌన్, రాజాపానగల్ రోడ్డు, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్, 1వ వార్డు, 20వ బ్లాకు, టి.యస్.నెం.856 రు దాఖలా, డోర్ నెం.5–1–42 రు, **అసిన్‌మెంట్ నెం.1035011873 రు, యస్.సి.నెం.4353202017505** ర్లు గల ఆర్.సి.సి డాబా ఇల్లు స్థలమునకు హద్దులు :
తూర్పు : కత్తి సుబ్బయ్యగారి ఆస్తి, **దక్షిణం :** పొందూరి కోటయ్య గారి ఆస్తి, **పడమర:** ఉయ్యాల అచ్చయ్య గారి తాలూకు ఇల్లు, **ఉత్తరం :** చింతపల్లి రంగమ్మ గారి ఆస్తి కొంతవరకు, 5 అడుగులు వెడల్పు గల ఈ ఆస్తి స్వంత దారి గుండా మునిసిపల్ రోడ్‌లోకి పోవు హక్కు
ఈ నాగులు హద్దులలోని 12 గదుల 20 చ. అడుగులు లేక 98.2/9 చ.గజముల స్థలము, ఈ స్థలములో నిర్మాణము చేసి యున్న ఆర్.సి.సి డాబా ఇల్లు.

ఇట్లు... **చల్లా వెంకటప్పారెడ్డి,** న్యాయవాది,
డోర్ నెం.46–139–63, 2వ లైన్, క్రిష్ణా నగర్,
వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర, సమతా నగర్, ఒంగోలు,
ప్రకాశం జిల్లా. సెల్ : 9848044909

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No: 590/2024

కలగొట్ల సరోజమ్మ వగైరాలు ..వాదులు
వర్సస్
పామూరి ఉమాదేవి ..ప్రతివాది

To
పామూరి ఉమాదేవి భర్త వెంకట సుబ్బారెడ్డి,
46 సం.లు, హిందూ,గృహిణి,
డోర్ నెం 8–21–38/4, గణేష్ నగర్, గిద్దలూరు
టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాదుల పేరటికి ప్రతివాది వ్రాయించి యిచ్చిన రిజిష్టర్డు అయక పత్రము బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో నీకేమైన ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేది 14–05–2025న ఉదయం గం.10:30ని.లకు స్వయంగా గాని, లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో మీపరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు
తేదీ : 07-05-2025 ఇట్లు
శ్రీ యస్.వి.నాగేంద్రబాబు,
వాదులపరం అడ్వకేట్,
గిద్దలూరు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No : 598/2023

అలసందలపల్లి లక్ష్మీదేవి .. వాది
వర్సస్
పాణెం చిన్న సుబ్బారెడ్డి అలియాస్
వెంకటసుబ్బారెడ్డి (పోతి) వారసులు
పాణెం నాగేశ్వరమ్మ వగైరాలు ..ప్రతివాదులు

To
2వ ప్రతివాది:
పాణెం వెంకటరెడ్డి తండ్రి లేట్ చిన్న సుబ్బారెడ్డి
అలియాస్ వెంకటసుబ్బారెడ్డి, వయస్సు 53 సం.లు,
హిందు, పోలీస్ కానిస్టేబుల్,
4వ ప్రతివాది:
పానెం నాగేశ్వరరెడ్డి తండ్రి లేట్ చిన్న సుబ్బారెడ్డి
అలియాస్ వెంకటసుబ్బారెడ్డి వయస్సు 33 సం.లు,
హిందు, ఆర్మీ ఉద్యోగి,
ఇరువురు క్రిష్ణంశెట్టి పల్లె గ్రామము,
గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలోని వాది మీనుండి దావా ప్రాంసరీ నోటు బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో మీకేమైనా ఆక్షేపణలు వున్న యెడల మీరు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేదీ 16–05–2025న ఉదయం గం.10:30 ని.లకు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని హాజరై, మీఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనిచో మీపరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు
తేదీ : 07-05-2025 ఇట్లు
శ్రీ యస్.వి.నాగేంద్రబాబు,
వాదిపరం అడ్వకేట్,
గిద్దలూరు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

'ఉపాస్' ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు పట్టణంలోని పోస్ట్ ఆఫీస్, పాస్‌పోర్టు ఆఫీస్ ఆవరణంలో సీనియర్ పోస్ట్ మాస్టర్ బి.శ్రీనివాస రావు సహకారంతో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు గురువారం నిర్వహించారు. ఈ క్యాంపులో సుమారు 120 మందికి షుగరు, బిపి, బిఎంఐ వైద్య పరీక్షలు నిర్వహించారు. స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నవారికి ఏడు రోజుల కాల వ్యవధి కలిగిన ఉచిత ఓపి, మరియు సిఆర్‌పి, పిపిబిఎస్, టిఎస్‌హెచ్, ఆర్ఏ ఫాక్టర్ వైద్య పరీక్షలు హాస్పిటల్‌లో ఉచితంగా చేయనున్నట్లు హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ వికలాంగ అభ్యర్థులకు క్రాష్ కోర్సులో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి పరీక్షలకు సన్నద్ధమవుతున్న వికలాంగ అభ్యర్థులకు (దష్టి లోపం, వినికిడి లోపం, అంగ వైకల్యం, మానసిక దివ్యాంగులు, నిర్దిష్ట అభ్యాస వైకల్యం గలవారు) క్రాష్ కోర్స్‌ను ప్రత్యేక బోధన పద్ధతిలో శిక్షణను ఉచితంగా విజయవాడలో నిర్వహించనున్నట్లు సహాయ సంచాలకులు జి.అర్చన ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో 'ఎండిఎఫ్‌సి.ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్' వెబ్ సైట్‌లో స్వీకరించబడునని తెలిపారు. కనీసం 40 శాతం వైకల్యం కలిగి ఉండాలన్నారు. ఎంపిక ప్రక్రియ టెట్ పరీక్ష మార్కులు ఆధారితంగా తీసుకోబడునని తెలిపారు. శిక్షణ సమయంలో స్టడీ మెటీరియల్, భోజనం, వసతి, ఉచితంగా కల్పిస్తారని పేర్కొన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలోని డియస్‌సి పరీక్షలకు సన్నదమవుతున్న వికలాంగులు సదరు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గుండెపోటుతో ప్రయాణికుడు మృతి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం ఒక వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందాడు. కట్టశింగన్న పాలెంకు చెందిన బండారి వెంకటేశ్వర్లు(70) వైద్యం కోసం ఒంగోలు వెళ్లేందుకు పొదిలికి వచ్చాడు. భార్యతో వచ్చిన ఆయన గుండెల్లో మంటగా ఉందని బల్ల మీద కుప్పకూలిపోయాడు. 108 సిబ్బంది వెంకటేశ్వర్లును పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి సమాచారాన్ని సేకరిస్తున్నారు.

సిఐ స్వర్ణలతే ఎసిబి నకిలీ ఎస్‌పి

అరెస్టు చేసిన పోలీసులు

గతంలో ఆమెపై నోట్ల మార్పిడి కేసు

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)

స్థానిక సబ్ రిజిస్ట్రార్ చక్రపాణిని బెదిరించిన నకిలీ ఎసిబి ఇన్‌స్పెక్టర్ సుధాకర్ కేసులో ఆసక్తికర ట్విస్ట్ చోటుచేసుకుంది. సుధాకర్ భాగోతం వెనుక గతంలో ఇలాంటి నేరాలకే పాల్పడి వేటుకు గురైన రిజర్వ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత ఉందని పోలీసులు గురువారం తేల్చారు. ప్రస్తుతం బాపట్ల ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో సిఐగా పనిచేస్తున్న ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పిఎం.పాలెం సిఐ బాలకృష్ణ వెల్లడించారు.

అసలింతకీ ఏం జరిగింది ?

సుధాకర్ అనే వ్యక్తి బుధవారం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తాను ఎసిబి సిఐనని రిజిస్ట్రార్‌ను పరిచయం చేసుకున్నాడు. రెండు మూడు రోజుల నుంచి గమనిస్తున్నానని, ఉద్యోగం పేరుతో అవినీతికి పాల్పడుతున్నారని రిజిస్ట్రార్‌ను బెదిరించాడు. ఎటువంటి కేసూ లేకుండా చేసేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసాడు. అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్ 'మీరు ఎసిబి సిఐ అని ఎలా నమ్మాలి' అని ఎదురు ప్రశ్నించాడు. దీంతో ఎసిబి ఎస్‌పిగా చెప్పుకునే ఒక మహిళతో సుధాకర్ ఫోనులో మాట్లాడించాడు. ఆ మహిళ సైతం తాను ఎసిబి ఎస్‌పినని బెదిరించడంతో అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి పిఎం.పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి నకిలీ ఎసిబి అధికారిని అదుపులోకి తీసుకున్నారు. కూపీ లాగితే ఒక్కొక్కటిగా విషయాలు వెలుగుచూశాయి. సుధాకర్ ఫోన్‌లో నకిలీ ఎసిబి ఎస్‌పిగా పరిచయం చేసుకుని రిజిస్ట్రార్ చక్రపాణిని స్వర్ణలత బెదిరించినట్టు ఫోన్ నెంబర్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఆమెను అరెస్టు చేశారు. గతంలో విశాఖలో రూ.2 వేల నోట్ల మార్పిడి వ్యవహారంలో కొందరిని ఆమె బెదిరించి జైలుకు కూడా వెళ్లారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

నలుగురు నిందితులు అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు

ఒకటిన్నర కిలో గంజాయి స్వాధీనం

వివరాలు వెల్లడించిన డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరిలో గంజాయి ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కనిగిరి పోలీస్ స్టేషన్లో గురువారం డిఎస్పి పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కనిగిరి పట్టణంలోని మంగలి మన్యంకు చెందిన నాగులూరి నరసింహ, నాగులూరి రాజేశ్వరి, దొరువు బజారుకు చెందిన కట్టాదుర్గ, పాతూరుకు చెందిన నాగులూరి దుర్గాప్రసాద్ అనే నలుగురు నాగులూరి వెంకటేశ్వర్లు, అతని కుమారుడు నాగులూరి అంకబాబు వద్ద ఒకటిన్నర కేజీ గంజాయి కొనుగోలు చేసి కనిగిరిలోని దొరువు సమీపంలో పొట్లాలుగా కట్టి విక్రయిస్తుండగా కనిగిరి సీఐ షేక్ ఖాజావలి, కనిగిరి హెచ్‌ఎంపాడు ఎస్ఐలు

సిబ్బందికి రివార్డు అందజేస్తున్న ఎస్‌పి

మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

టి.శ్రీరామ్, మాధవరావు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కొనుగోలు చేసిన నలుగురిని అదుపులో తీసుకోగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి సుమారు పాతికవేల విలువైన ఒకటిన్నర కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితులను కూడా అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరుస్తామన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక టీం: డీఎస్పీ

గంజాయి ప్రతిరోజూ వినియోగిస్తున్న 20 మందిని గుర్తించి వారిపై కూడా చర్యలు చేపట్టడం జరుగుతుందని డీఎస్పీ తెలిపారు. ఇటీవల కనిగిరిలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో గంజాయి విక్రయాల సమాచారం తెలుసుకుని నిఘా పెట్టి నిందితులను పట్టుకోవడం జరిగిందన్నారు. గంజాయి విక్రయించినా, కొనుగోలు చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనకు ఒక ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామన్నారు. ఆ టీం సభ్యులు చాకచక్యంగా వ్యవహరించి గంజాయి కొనుగోలు చేసే విక్రయిస్తున్న వారిని పట్టుకున్నారన్నారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్ఐలను అభినందించారు. ప్రత్యేకంగా కృషి చేసిన కానిస్టేబుల్స్ నారాయణ, నూనె నాగేశ్వరరావు, హోంగార్డు మోతుకూరి సీతారాం ప్రసాద్‌లను అభినందిస్తూ క్యాష్ రివార్డును ప్రోత్సాహకంగా అందజేశారు.

వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బాల్య వివాహం అడ్డగింత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు శివారు ప్రాంతంలోని ఓ కాలనీలో బాల్య వివాహాన్ని పోలీసులు, అధికారులు అడ్డుకున్నారు. ఒంగోలు తాలూకా ఎస్ఐ సందీప్ సమాచారంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్ కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్, మహిళ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఎన్.చంద్ర లీల, తాలూకా హెడ్ కానిస్టేబుల్ వై.బాధరియా స్థానిక మహిళా పోలీస్ యామిని, మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ కె.ఆదిలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు సంధ్యా, రత్నకుమారి బాల్య వివాహం జరిగే ప్రాంతానికి చేరుకుని వివాహాన్ని అడ్డుకున్నారు. ఇరుపక్షాల తల్లిదండ్రులకు, పెద్దలకు బాల్య వివాహం వల్ల జరిగే నష్టాలను వివరించారు. బాల్యవివాహం చేస్తే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటారని వారికి అవగాహన కలిగించి బాలికకు 18 సంవత్సరాల వరకు వివాహం చేయకూడదని వారికి తెలియజేశారు. ఈ విషయాన్ని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బివి సాగర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాల కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి, జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు నీలిమ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సార్డ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారు-ఆటో ఢీ.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-మార్కాపురం

దెబ్బతిన్న కారు

మార్కాపురం చెరువుకట్ట మార్గంలో రహదారి పూర్తిగా దెబ్బతింది. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా గురువారం తెల్లవారుజామున ఓ పేపర్ కారు వేగంగా వస్తూ గుంతలను తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఆటో, కారు రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. స్వల్ప గాయాలు కావడంతో ప్రైవేటు వైద్యశాల్లో క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు.

వెంకటరెడ్డిని పరామర్శిస్తున్న కదిరి బాబూరావు

ప్రమాద బాధితుడికి 'కదిరి' పరామర్శ

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కనిగిరి పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తమ్మినేని వెంకటరెడ్డిని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు గురువారం పరామర్శించారు. వెంకటరెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కదిరి బాబూరావు గురువారం కనిగిరిలోని కొత్తూరులో వెంకటరెడ్డి నివాస గృహానికి వెళ్లి పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వింగ్ వైసీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మనేని సుజాత, మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్, రాముర‌ెడ్డి, ముత్యాల ప్రతాప్ తదితరులు ఉన్నారు.

లోగ్రేడ్ పొగాకునూ కొనుగోలు చేయాలి

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రైతు సంఘం జిల్లా నాయకులు పిల్లి తిప్పారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పొగాకు వేలం కేంద్రంను పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ గురువారం సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు పిల్లి తిప్పారెడ్డి పొగాకు రైతులతో కలిసి ఆమెను కలిశారు. పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులను, సమస్యలను ఈడి విశ్వశ్రీ దృష్టికి తీసుకువెళ్లారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే కోలుకోవడం కష్టతరమని తెలియజేశారు. గత ఏడాది సగటు రూ.250 ఉండగా ఈ ఏడాది తగ్గిందన్నారు. ఇలాగైతే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. 18 మంది కంపెనీల ప్రతినిధులు పొగాకు కొనుగోలుకు రావాల్సి ఉండగా కేవలం 9 మంది

పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీకి సమస్య వివరిస్తున్న తిప్పారెడ్డి

మాత్రమే వస్తున్నారని, దీంతో పోటీ లేకపోవడంతో ఇష్టం వచ్చినట్లు గిట్టుబాటు ధర ఇవ్వకుండా చేస్తూ రైతులను నష్టపోయేలా చేస్తున్నారన్నారు. గ్రేడ్ వన్ పొగాకును మాత్రమే కొనుగోలు చేస్తామని చెబుతూ గిట్టుబాటు ధర మాత్రం కల్పించడం లేదన్నారు. ఇకలో గ్రేడ్ పొగాకును అసలు కొనుగోలు చేయడం లేదని రైతులు వేలం కేంద్రానికి తీసుకురావడం ఇంటికి తిరిగి తీసుకువెళ్లడం ఇదే తంతు కొనసాగుతోందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. 40 శాతం మాత్రమే గ్రేడ్ వన్ పొగాకు పండిందని మిగిలిన 60 శాతం లోగ్రేడ్ వచ్చిందని తెలిపారు. స్పందించిన ఈడి విశ్వశ్రీ రైతులకు న్యాయం జరిగేలా గిట్టుబాటు ధర కల్పించేలా, లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. కంపెనీల ప్రతినిధులు, రైతులతో కలెక్టరేట్లో సమావేశం నిర్వహించి న్యాయం జరిగేలా చూస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సెక్రటరీ డి.వేణుగోపాల్, కనిగిరి వేలంకేంద్రం ఆక్షన్ సూపరిండెంట్ బి.కోటేశ్వరరావు, రైతులు ఆరికట్ల బ్రహ్మయ్య, ఎన్ మాలకొండయ్య, కుందూరు రవీంద్ర, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు హో రైజన్ స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి - వేటపాలెం

పి రవికుమార్, సెక్రటరీ

అత్యుత్తమ విద్య అందించేందుకు హెూ రైజన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభిస్తున్నట్లు ప్రముఖ విద్యావేత్త, పాఠశాల సెక్రెటరీ కరెస్పాండెంట్ పొగడదండ రవికుమార్ తెలిపారు. మండలంలోని రామన్నపేట పంచాయితీ సాయినగర్‌లో శుక్రవారం అత్యంత వైభవంగా హెూ రైజన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పర్చూరు, చీరాల శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, మద్దులూరి మాల కొండయ్య, మచిలీపట్నం ఎంపీ వి బాలసౌరి, రిటైర్డ్ ఐపిఎస్ జెడి లక్ష్మీనారాయణ, జాంధ్రపేట ఇస్కాన్ మందిర్ వ్యవస్థాపకులు కె శివ శంకరరావు, సులోచన, తెలుగు దేశం నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంధ్రనాద్ హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటపాలెం కొత్త కాలువ ఆర్ అండ్ బి రహదారిలోని బ్రిడ్జి ప్రక్కన వినాయక స్వామి గుడి ఎదురుగా సాయి నగర్ నందు ప్రశాంతమైన వాతావరణంలో ఆహ్లాదకరమైన మామిడి తోటల్లో విద్యార్థులను ఆకట్టుకునేలా నూతనంగా నిర్మించిన తరగతి గదులతో పలువురు డాక్టరేట్లు పొందిన ప్రొఫెసర్ల సమక్షంలో అత్యున్నత విద్యాబోధన చేయనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవంలో పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ ప్రెసిడెంట్ డాక్టర్ పి హరిణి, మేనేజింగ్ డైరెక్టర్ పి హర్షి పాల్గొన్నారు.

నాగమల్లేశ్వరరావుకు నివాళులర్పించిన నాయకులు

నాగమల్లేశ్వరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - కొల్లూరు

యుటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఉద్యమ కార్యకర్త కామ్రేడ్ పి నాగమల్లేశ్వరావు 4వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి వినోద్ బాబు, మాజీ జిల్లా కార్యదర్శులు శాంతారావు, కె శ్రీనివాసరావు, పరిశుద్ధరావు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టి కృష్ణమోహన్, సిపిఎం నాయకులు బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు

అర్హులైన ప్రతి కుటుంబానికీ రేషన్ కార్డు

ప్రజాశక్తి - పంగులూరు

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా రేషన్ కార్డు అందించాలని చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో గురువారం రెవెన్యూ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేపై ఆరా తీశారు. సర్వేలో ఉన్న సమస్యను అడిగి తెలుసుకున్నారు. రైతులు అందుబాటులో ఉండే విధంగా చూసుకొని రి సర్వే చేస్తే ఎలాంటి సమస్యలు రావని అన్నారు. రైతుల నుంచి వివరాలు సేకరించి నిష్పక్షపాతంగా రీ సర్వే చేయాలని ఆర్‌డిఓ కోరారు. ఆయా గ్రామాలకు చెందిన రైతుల నుండి నీటి పన్ను వసూలు చేయాలని కోరారు. నూటికి నూరు శాతం నీటి పన్ను వసూలు అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. రేషన్ కార్డుల సమస్య పరిశీలించి అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు అందేలా చేయాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు పి సింగారావు, రీ సర్వే డిటి అర్జునరావు, మండల సర్వేయర్లు, ఆర్ఐ టి శ్వేత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే దేశవ్యాప్త సమ్మె

20న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చీరాల

పీహెచ్సి అధికారికి సమ్మె నోటు ఇస్తున్న ఆశా కార్యకర్తలు

ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి, కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా మార్పుచేసి సమస్యలు పరిష్కారం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అనుబంధ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వరమ్మ కోరారు. ఈ నెల 20న చేపట్టిన సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ వైకుంఠపురం యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రణయ్ కుమార్‌కు,,వేటపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వైష్ణవికి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒప్పంద జీఓలు విడుదలచేయాలని కోరారు. నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్స్ సాధనకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశా కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలి అన్నారు. కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే లేబర్ కొడ్స్ రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వ రంగసంస్థలు పరిరక్షించాలని కోరారు. గత 20ఏళ్లుగా పేదప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో ఆశా వర్కర్లు అర్ధాంతరంగా చనిపోతున్నారని, ప్రభుత్వం ఆశావర్కర్లకు గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. ఏజెన్సీలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశా కార్యకర్తలుగా మార్పు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు కె కరిమున్, ఎం తులసిలక్ష్మి, కె శివపార్వతి, ఎస్ కిరణ్ కుమారి, పి పద్మావతి, రాణి శారద, నాగలక్ష్మి, హైమా, మాణిక్యం శ్రీదేవి, చిన్ని, రజిని, కస్తూరి, అనురాధ పాల్గొన్నారు.

బాధితులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - చీరాల

బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన ప్రతి బాదితున్ని ప్రభుత్వం ఆదుకుంటూ అండగా నిలబడుతుందని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. ఇటీవల కురిసిన వర్షాల్లో పిడుగుపాటుకు గురై మృతి చెందిన పశువుల యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని ఆయన బాధితులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన భారీ వర్షానికి పాత చీరాల, కొత్తపాలెంలో పిట్టు పోతురాజు అనే రైతుకు చెందిన రెండు ఎద్దులపై పిడుగు పడి చనిపోవుగా వారికి రూ.80వేలు ఆర్థికసాయం చెక్కు రూపంలో అందజేశారు. పాత చీరాల కొత్తపాలెంలో నాయుడు మనోహరరెడ్డి అనే రైతు గేదపై పిడుగు పడి మృతి చెందాగా వారికి రూ.50 వేల చెక్కు, హరిప్రసాద్ నగర్లో కె శ్రీనివాసరెడ్డి అనే రైతు గేదపై పిడుగు పడి చనిపోవుగా వారికి రూ.50వేలు, కొత్తపేటలో కటకం మహేశ్వరరావు అనే రైతు గేదపై పిడుగు పడి చనిపోవుగా వారికి రూ.50వేల చెక్కులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఒ చంద్రశేఖర్ నాయుడు, తహశీల్దారులు గోపి కృష్ణ, పార్వతి, మునిసిపల్ డిఈ రఘురాం, అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులు

'రామ్‌శ్రీ' ప్యాలెస్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - సంతమాగులూరు

గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ స్థాయి అభివృద్ధికి నాంది పలకడం విజయ్ కన్స్ట్రక్షన్ కృషి అభినందనీయమని వినుకొండ శాసన సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులు తెలిపారు. మండలంలోని పుట్టా వారిపాలెం అడ్డరోడ్డు సమీపంలో గుంటూరు, కర్నూలు రహదారి వెంట విజయ్ కన్స్ట్రక్షన్ వారి రామ్ శ్రీ ప్యాలెస్ నూతన భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టావారిపాలెం అడ్డరోడ్డు జంక్షన్ వ్యాపార వర్గాలకు కూడలి కానున్నదన్నారు. ఈ జంక్షన్ రెండు జాతీయ రహదారులకు కూడలిగా కలిసొచ్చె అంశమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని అన్నారు. ఆ కోవలోనే పల్నాడు, బాపట్ల జిల్లాలు సమగ్ర అభివృద్ధి చెందనున్నాయని అన్నారు. స్థానిక శాసన సభ్యులు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సారథ్యంలో అద్దంకి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందనున్నట్లు తెలిపారు. అనంతరం కన్స్ట్రక్షన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్, వినుకొండ మాజీ శాసన సభ్యులు, జిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, వెల్లలచెరువు సొసైటీ అధ్యక్షులు చింతా శ్రీధర్, గమిడి కోటేశ్వరరావు, గాడిపర్తి వెంకట్రావు, ఎన్ఎస్‌పి డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు కామాను శ్రీనివాసరావు, చేవూరి వాసురెడ్డి, వసంత వేణుబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీకి నిధులు పెంచాలి

ప్రజాశక్తి - కొల్లూరు

అనంతవరంలో ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న బి సుబ్బారావు

ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కార్మికులతో ఆయన గురువారం మాట్లాడారు. ప్రతి కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించాలని కోరారు. రోజుకూలి రూ.600 ఇవ్వాలని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నీరుగార్చాలని చూస్తుందని ఆరోపించారు. పొమ్మనలేక పొగ పెట్టే విధంగా చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించిందని అన్నారు. పనిముట్లను కూలీలకు ఇవ్వడం లేదని, వేసవిలో అలవెన్స్ ఇవ్వడం లేదన్నారు. ఎండలు విపరీతంగా ఉన్న టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించడం లేదనని అన్నారు. వ్యవసాయ కూలీలకు సమాన పనికి సమాన వేతనం వచ్చే విధంగా ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకు ఈనెల 20న దేశ వ్యాప్త ఉపాధి హామీ, వ్యవసాయ కార్మికులు రక్షణకు భారతదేశం బంద్ చేపడుతుందని అన్నారు. అందరూ పాల్గొని బంద్ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అనంతవరం, క్రాప గ్రామాలకు చెందిన మేట్లు శ్రీనివాసరావు, పూర్ణ కుమారి, వెంకటరావు, అనిల్, సుజాత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణపై సమగ్ర సర్వే

ప్రజాశక్తి - అద్దంకి

కమిషనర్‌ను కలిసిన డిబిఆర్‌సి ప్రతినిధులు

మున్సిపాలిటీ పరిధిలో చెత్త కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించేవారి వివరాలు నమోదు చేసి, వారిని సామాజిక భద్రత పథకాల్లో భాగస్వామ్యం చేయడం కోసం ఈనెల 14న ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి రవీంద్ర తెలిపారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే) పథకం అనేది పొడి వ్యర్థాలు ఏరుకునేవారు, పారిశుధ్య కార్మికులు, వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు, నైపుణ్యం మెరుగుదలకు తోడ్పాటు, శిక్షణ అందించడం ద్వారా వారికి సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన పథకం అన్నారు. ఈ పథకం కింద పట్టణంలో పొడి చెత్త ఏరుకునే వేస్ట్ పిక్కర్లను నమస్తే పథకంలో వివరాలు నమోదు చేసుకునేందుకు ఒక యాప్ రూపొందించామని అన్నారు. కార్యక్రమానికి జిల్లా రిసోర్స్ ఆర్గనైజేషన్‌గా ఎంపిక కాబడిన దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధులు దార్ల కోటేశ్వరరావు, వి భగవాన్ దాస్ మున్సిపల్ కమిషనర్‌తో కార్యక్రమంపై చర్చించారు. బ్యాంక్ అకౌంట్లు, ఆధార్ కార్డులు, ఈ శ్రమ కార్డులు లేని వేస్ట్ పిక్కర్లకు ఈ శిబిరం ద్వారా నమోదు చేసి గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిబిఆర్సి ప్రతినిధులు, సానిటరీ ఇన్స్పెక్టర్ డి బలరామరెడ్డి పాల్గొన్నారు.

హెన్రీ డు నాట్‌కు నివాళులర్పిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

సాయం చేయడమే రెడ్ క్రాస్ లక్ష్యం

ప్రజాశక్తి - కర్లపాలెం

ఆపదలో ఉన్న వారికి సహాయం చేసే అంతర్జాతీయ స్వచ్ఛంద రెడ్‌క్రాస్ సంస్థని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీస్ రావు అన్నారు. రెడ్ క్రాస్ వ్యవస్థాపక దినోత్సవం స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డు నాట్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. రెడ్ క్రాస్ లక్ష్యాలు వివరించారు. యుద్ధంలో క్షతగాత్రులకు, పకృతి వైపరీత్యాల వలన దెబ్బతిన్న వారికి సహాయం చేయడమే రెడ్ క్రాస్ ప్రధాన లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఎం పరమానంద కుమార్, పి ధనుంజయరావు, బి రాజేష్, జి వెంకటరెడ్డి, వి బాబు పాల్గొన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా
- ఉపాధి పనులు పరిశీలన

కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి- టంగుటూరు

ఉపాధి కూలీలకు యావరేజ్ కూలి పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా డ్వామా అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని జయవరం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న సాగునీటి కాలువలో పూడిక తీత పనులను కలెక్టర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చేసిన పనులకు సకాలంలో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కూలీల హాజరు, పని ప్రదేశంలో తాగు నీరు, నీడషెడ్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుని పని చేయాలని తెలిపారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా మేడపల్లి రాజమ్మ అనే మహిళ కూలి తాను వితంతువు పెన్షనుకు అర్హులని, అయినప్పటికీ రావడం లేదని, పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ రాజమ్మకు వితంతువు పెన్షను మంజూరుకు తగు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ దేవసేన కుమారిని ఆదేశించారు. అదేవిధంగా గత మూడు సంవత్సరాల నుంచి తన భర్తకు ఆరోగ్యం బాగాలేక మంచంలోనే ఉన్నాడని, తను కుమారుడు కూడా మరణించాడని తనకు పెన్షను మంజూరు చేయాలని యరజర్ల భారతమ్మ కలెక్టర్‌ను కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ భారతమ్మకు పెన్షను చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒను ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పశువుల నీటి తొట్టిని కలెక్టర్ ప్రారంభించారు. అదేవిధంగా ఎరమోసు సుధాకర్ పొలంలో నిర్మిస్తున్న ఫారం పాండ్‌ను కలెక్టర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసు కున్నారు. యల్లవరపు వెంకట సుబ్బారెడ్డి ఇంటి పై పిఎం సూర్యఘర్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్‌ను కలెక్టర్ పరిశీలించారు.కలెక్టర్ వెంట డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, తహశీల్దారు ఆంజనేయులు, గ్రామ సర్పంచి పేరమ్మ, విద్యుత్ శాఖ ఇఇ హరిబాబు, ఎంపిడిఒ ఆర్. దేవసేన తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సురేష్‌ను సన్మానిస్తున్న రవికుమార్‌రెడ్డి

మాజీ మంత్రి సురేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-శింగరాయకొండ

మాజీ మంత్రి, వైసిపి కొండపి నియోజక ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను శింగరాయకొండ వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. గతంలో రవికుమార్ రెడ్డి వైసిపి మండల అధ్యక్షుడి ఉన్న సమయంలో ఆయన స్వగ్రామైన బింగినపల్లిలో గొడవలు జరిగాయి. ఆ సమయంలో పోలీసు స్టేషన్‌ను రావాలని ఆదిమూలపు సురేష్‌ను కోరారు. ఈ క్రమంలో వారి ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. దీంతో సామంతుల రవికుమార్ రెడ్డిని పార్టీ నుంచి వైసిపి సస్పెండ్ చేసింది. రవికుమార్ రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తి వేస్తున్నట్లు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఉత్వర్వులు అందాయి. అందులో భాగంగా మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో రవికుమార్ రెడ్డి కలిసి శాలువా కప్పి సన్మానించారు. వైసిపి అభివద్ధి కోసం తాను కషి చేస్తానని ఈ సందర్భంగా రవికుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, షేక్.కరీం, పి.శ్రీనివాసరెడ్డి, చుక్కా కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకు సరాసరి ధర రూ.254.06 పైసలు పలికినట్లు వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని ధర్మవరం, కోయవారిపాలెం, ముక్కోడిపాలెం,తాటాకులపాలెం,వెంకట కృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు 1220 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 981 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 239 బేళ్లను తిరస్కరించారు.కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ. 210 పలికింది. వేలంలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాలడుగు రాజీవ్

జగన్‌ను కలిసిన రాజీవ్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్ వైసిపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలుతెలిపారు. తనకు రాష్ట్ర స్థాయి పదవి కేటాయిం చినందుకు జగన్‌కు రాజీవ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కషి చేయాలని రాజీవ్‌కు జగన్ మోహన్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. పార్టీ అభివృద్ధికి తన వంతుకృషి చేస్తానని పాలడుగు తెలిపాడు.

నేడు 'రైజ్'లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక రైజ్ కష్ణ సాయి గ్రూప్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం అపిత, రైజ్ కష్ణ సాయి సంస్థల సౌజన్యంతో వర్చూసా కంపెనీ వారు పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు గురువారం తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలను అపిత టీమ్, వర్చూసా హెచ్ఆర్ బృందం నిర్వహించన్నుట్లు తెలిపారు. ఎంపికల్లో భాగంగా విద్యార్థులకు ప్రీప్లేసెమెంట్ టాక్ అనంతరం లెవెల్ 1 మరియు లెవెల్ 2 రౌండ్స్(టెక్నికల్ అండ్ కమ్యూనికేషన్) నిర్వహిం చనున్నట్లు తెలిపారు. అనంతరం ఫైనల్ నియామకం చేపట్టనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎవి.భాస్కరరావు తెలిపారు. ఈ డ్రైవ్‌కు జిల్లా నలుమూలల్లోని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 9.గంటలకు రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు బయోడేటా, ఆధార్, పాన్ కార్డు, మార్కుల మెమోలు తమ వెంట తెచ్చుకోవాలని కళాశాల ప్లేసెమెంట్ అధికారి ఎన్‌వి .రఘు బాబు తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే ఇతర కళాశాలల విద్యార్థులు, రైజ్ విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఇస్కాల రంగమన్నార్ , రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, డైరెక్టర్ డాక్టర్ ఎవి. భాస్కర రావు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఈ డ్రైవ్‌ను పాల్గొని తమ ప్రతిభను చూపి ఉద్యోగాలను సాధించాలని కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు.

కన్నుల పండుగగా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - మద్దిపాడు

మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రోత్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట గురువారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయ్ కుమార్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ , మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 సూత్రాల చైర్మన్ లంక దినాకర్, వైసిపి ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు, మహా న్యూస్ టీవీ చైర్మన్ మారెళ్ళ వంశీ, టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, గ్రానైట్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ సభ్యులు, మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండవ రంగారావు, టిడిపి నాయకులు మండవ గోపీచంద్, పోకూరి శ్రీనివాసరావు, చింతల శ్రీనివాసరావు, చెరుకూరి వాసు, ముళ్ళూరి మురళి, రావి నరసింహారావు, పారా నరసింహారావు,తుమ్మల సుధాకర్, ముత్తనపల్లి రామలింగయ్య, రెబ్బవరపు ప్రభాకర్ రావు, రావి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు నీలాయపాలెం పొలిమేరలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి కళ్యాణం వేదపండితుల శిష్టా పాండురంగయ్య ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నీలాయపాలెం. ఉప్పుగుండూరులో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా ఉప్పుగుండూరులోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో ఆరాధన మహోత్సవం నిర్వహించారు. గోనుగుంట బ్రహ్మాచారి ఆద్వర్యంలో స్వామివారి కళ్యాణం వైభోపేతంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం రంగురంగుల విద్యుత్ దీపాలతో స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అబ్దుల్ మాలిక్

పాటలు, పొడుపు కథలతో అలరించిన సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

విద్యా విషయాలతో పాటు ఆట పాటలు -కథలు -పొడుపు కథలు బాలల మానసిక వికాసానికి దోహదపడతాయని జనవిజ్ఞానవేదిక సాంస్కృతిక విభాగం కన్వీనర్ అబ్దుల్ మాలిక్ తెలిపారు. ఎల్‌బిజి భవన్‌లో ప్రకాశం బాలోత్సవం, ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు నాల్గవరోజు సందర్భంగా గురువారం విద్యార్థుల చేత కథలు చెప్పడం, పొడుపు కథలు, పాటలు నేర్పించారు.పిల్లలకు కథలు నేర్పడం ద్వారా వాటిలోని నీతిని గ్రహిస్తారని నిజజీవితంలో వాటిని ఆచరిస్తారని అన్నారు. విద్యార్థులు తాము నేర్చుకున్న కథలు, పొడుపు కథలు పోటీపడి చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ నాయకులు ఇంద్రజ్యోతి, మ్యాజిక్ రామన్, వీరాస్వామి, వినోద్ పాల్గొన్నారు.

వీరయ్య చౌదరికి ఘన నివాళి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామంలో మాజీ ఎంపిపి, టిడిపి బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి ముప్పవరపు వీరయ్యచౌదరి సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వీరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మంచి నాయకుడు, టిడిపి కుటుంబ సభ్యుడిని కోల్పోయామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వీరయ్య చౌదరికి నివాళులర్పించిన వారిలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయ్ కుమార్, ఒంగోలు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు , ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ,కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు , చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య , టిడిపి దర్శినియోజక వర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి , మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య , ఎపి టూరిజం బోర్డు చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ,20 సూత్రాల చైర్మన్ లంక దినకర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు దామచర్ల, విజయకుమార్

ఎయిడ్స్ నివారణకు కళా ప్రదర్శనలు

వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి విజయమ్మ

జండా ఊపి కళాజాత ప్రారంభిస్తున్న విజయమ్మ

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో ఎయిడ్స్ మహమ్మారి పూర్తిస్థాయిలో నివారణకు కళాజాతా బృందాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ తెలిపారు. జిల్లా కార్యాలయం వద్ద కళాజాత బృందాల ప్రచార కార్యక్రమాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రధాన పట్టణల్లోని మురికివాడలు, బస్టాండ్ కూడలి, మార్కెట్ ప్రాంతాల్లో జిల్లా వ్యాప్తంగా 20కళాజాత ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25వరకు కళాజాత బృందాలు వీధి నాటికల ప్రదర్శన ద్వార హెచ్ఐవి, ఎయిడ్స్ నిర్మూలన పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కళాజాత బృందాలు వీధి నాటకాల ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా సంక్ర మిస్తుంది, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారని అన్నారు. వ్యాధి గ్రస్తుల పట్ల వివక్షత చూపకుండా ఎయిడ్స్, క్షయ వ్యాధి గ్రస్తులైన గర్భిణిల నుండి గర్భస్థ శిశువుకు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తారని అన్నారు. కార్యక్రమమలో ఇమ్యునైజేషన్ జిల్లా అధికారి రత్నమన్మోహన్, లెప్రసీ, ఎయిడ్స్, టీబీ జిల్లా అధికారి షేక్ మొహమ్మద్ సాదిక్, దిశా క్లస్టర్ ప్రోగ్రామ్ జిల్లా మేనేజర్ జానిభాష, కళాజాత బృందాలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంట సాగు హక్కు పత్రంపై అవగాహన

సాగు హక్కు పత్రం అందజేస్తున్న ఎడిఎ విజయబాబు

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని బేతపూడి రైతు సేవ కేంద్రం పరిధిలో పంట సాగు దారుల హక్కు పత్రాలపై అవగాహన గురువారం కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్ బాబు మాట్లాడుతూ కౌలు రైతు కార్డుల వలన చేకూరే లాభాలు, పంటల భీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం, వ్యవసాయ రుణాలు, ధాన్యం అమ్ముకోవడానికి ఉపయోగ పడుతుందని రైతులకు తెలిపారు. కౌలు రైతు కార్డుల వల్ల కౌలు సాగు చేసే ప్రతి రైతు పంటపై పూర్తి హక్కులు కలిగి ఉంటారని అన్నారు. దీని వల్ల భూ యజమానులకు ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు. కేవలం పంటపైనే కౌలుదారులు హక్కు కలిగి ఉంటారని అన్నారు. భూమిపై ఎలాంటి హక్కులు ఉండవని వివరించారు. భూమిలేని కౌలు రైతులు కౌలు కార్డులు పొందటం వల్ల ప్రభుత్వ పథకాలు, పంట నష్ట పరిహారాలు, పంట బీమా, బ్యాంకు నుంచి ఋణాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఒ వెంకటేశ్వర్లు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ ఉచిత శిక్షణతో ఉపాధి

కుట్టు మిషన్ ఉచిత శిక్షణను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - పర్చూరు

ప్రభుత్వం కల్పిస్తున్న కుట్టు మిషన్ ఉచిత శిక్షణ పొందడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. స్థానిక యుపి స్కూల్లో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి సూచనలు చేశారు. హాజరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కుట్టు మిషన్ శిక్షణకు పేర్లు నమోదు చేసుకున్న మహిళలు తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలని చెప్పారు. హాజరు కాని వారి పేర్లను తొలగించడం జరుగుతుందని తెలపారు. 144 మంది మహిళలు ఉచిత శిక్షణకు పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. వీరిని రెండు బ్యాచులుగా చేసి ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో కుట్టు మిషన్ల శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన పొందాలని కోరారు. వాట్సాప్ ద్వారా ప్రభుత్వం కలిగిస్తున్న మనమిత్ర సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ట్రైనర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వీరయ్య చౌదరి మృతి పార్టీకి తీరని లోటు

వీరయ్య చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి మృతితో టిడిపి ఒక నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయిందని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని చీరాల ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. అమ్మనబ్రోలులో గురువారం జరిగిన వీరయ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో చీరాలలో తన గెలుపులో ఆయన కీలకపాత్ర పోషించారని అన్నారు. పార్టీలో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తీసుకున్న బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించగల అంకిత భావం కలిగిన కార్యకర్తను పార్టీ కోల్పోయిందని అన్నారు. వీరయ్య కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. చీరాల టిడిపి అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, యువ నాయకుడు అమర్నాథ్ తదితరులు వీరయ్యకు నివాళులు అర్పించారు.

పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

పిడుగుపాటుకు 23 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన కారుమూరి వెంకట్రామయ్య పొలాల్లో గొర్రెలు మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో గొర్రెలను ఒక చెట్టు కింద గుంపుగా తోలి ఉంచాడు. అదే సమయంలో ఆ చెట్టు మీద పిడుగు పడటంతో 23 గొర్రెలు చనిపోయినట్లు గొర్రెలు యజమాని తెలిపారు.

మహిళలను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తూ అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఇద్దరు మహిళలను మరైన్ పోలీసులు గురువారం కాపాడారు. గుంటూరు జిల్లా ఏటుకూరు రోడ్డు హనుమాన్ టెంపుల్ సమీపంలో బుల్లెట్ స్పిన్నింగ్ మిల్లులో నివాసం ఉంటున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం అలీఘడ్‌కు చెందిన దుర్గేశ్ దేవి, నిషా అనే ఇద్దరు మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి సూర్యలంక బీచ్ సందర్శనకు వచ్చారు. సముద్రంలో స్నానాలు చేస్తున్న సమయంలో ఎత్తైన అలల తాకిడికి సముద్రంలో కొట్టుకుపోతున్న వీరి అరుపులు విని, సూర్యలంక మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్ల వెంటనే స్పందించి వీరిని కాపాడినట్లు మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. ఎస్ఐ నాగ శివారెడ్డి, ఎఎస్ఐ అమరేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ గంగాధరరావు, హెూంగార్డ్ నారాయణ, బాపట్ల రూరల్ పోలీసులు, బీచ్‌లో ఈతగాళ్ల స్పందించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు తెలిపారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న కమిషనర్ సాంబశివరావు

ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - రేపల్లె

ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో పెద్ద కూరగాయల మార్కెట్ వద్ద ప్రజలకు వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించడానికి దాతల సహకారంతో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పట్టణ ప్రజల తోపాటు పరిసర గ్రామాల్లో ప్రజలకు ఉపయోగ పడే అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. అందులో భాగంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇదే విధంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి వై కిషోర్ బాబు, అధ్యక్షులు మోహనరావు, అనందరావు, జవహర్ సాంబశివరావు, ఇమా ముద్దీన్ ఖాద్రి, విజయ కుమార్, నాంచారయ్య పాల్గొన్నారు.

'పుట్టంరాజు' పురస్కారానికి ఎంపిక

ప్రజాశక్తి - అద్దంకి

డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి

పద్య సాహిత్యంలో విశిష్ట సేవలందించిన ప్రఖ్యాత కవి, పరిశోధకులు డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డిని 2025 సంవత్సరానికి 'పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ విశిష్ట సాహిత్య పురస్కారం'కు ఎంపిక చేసినట్లు ట్రస్టు అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి వెల్లడించారు. ఈ పురస్కార ప్రదానోత్సవం మే 18న పుట్టంరాజు కళాక్షేత్రంలో జరుగనున్నది. ప్రముఖ సాహితీ వేత్తలు, కవులు, గౌరవ అతిథులు పాల్గొంటారు. డాక్టర్ మస్తాన్‌రెడ్డి రచించిన 'కోదండరామ నక్షత్రమాల,' 'వీరాంజనేయ తారావళి,' 'భారత పద్యశైలి' వంటి కృతులు తెలుగు పద్య సాహిత్యంలో నూతన దిశలు చూపించాయి. ఆకాశవాణి, దూరదర్శన వేదికలపై పద్యాలు, ప్రవచనాల ద్వారా శ్రోతలను అలరించారు. సరసవినోదినిలో 300పైగా సమస్యాపూరణ పద్యాలు సమర్పించారు. నరసరావుపేట కాసు రాఘవమ్మ కళాశాల్లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. రాష్ట్ర అధ్యాపక పురస్కారం, పీహెచ్డి, ఎంఫిల్ స్థాయి పరిశోధనలు వీరి విశిష్టతకు నిదర్శనాలు. ఈ పురస్కారం తెలుగు సాహిత్య ప్రపంచానికి గర్వకారణమని నిర్వాహకులు తెలిపారు.

మాట్లాడుతున్న ఎఐటియుసి నాయకులు నాగాంజనేయులు

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 20న కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సంఘం విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర సమితి పి నాగాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక ఎఐటీయూసీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి గుమ్మడి నాగమల్లేశ్వరమ్మ అధ్యక్షత వహించారు. నాగాంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొని వచ్చిందని అన్నారు. ఇవి అమలు జరిగితే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోవడంతో పాటు సమ్మె, సంఘం పెట్టుకునే హక్కు కోల్పోతారని అన్నారు. సిపిఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమల్లోకి వేస్తే కార్మికులు నష్టపోతారని అన్నారు. సమావేశంలో బి కుసుమ కుమారి, జి శ్రీమన్నారాయణ, కె వెంకటరమణ, క్రాప జయమ్మ, కాగిత శ్రీనివాసరావు, కొలుసు నరేష్, సమ్మెట శ్రీనివాసరావు, యార్లగడ్డ కనకదుర్గా, గూడూరు అనూష, పరుచూరి పద్మావతి, తులసి, వేణు, శివరామకృష్ణ, చిప్పల వీరరాఘవయ్య, జి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - పర్చూరు

మండల పరిధిలోని గోరంట్ల వారిపాలెంలో వేయించేసిన శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు చేశారు. 25వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి పాలాభిషేకం, అర్చనలు గావించారు. బాబాను పూలతో అలంకరించారు. మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

12న మండల సమావేశం

ప్రజాశక్తి - అమృతలూరు

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 12న మధ్యాహ్నం 3గంటలకు ఎంపీపీ రాపర్ల నరేంద్ర అధ్యక్షత జరుగుతుందని ఎంపిడిఒ శేషమాంబ తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ అంశాలపై చర్చించి తీర్మానించనున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల నివేదికలతో హాజరు కావాలని సూచించారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పూర్తి

విద్వేషపూరిత వదంతులు వ్యాపింపజేస్తే కఠినచర్యలు

- సామాజిక మాధ్యమాలు, సోషల్ మీడియా, సైబర్ సెల్ పోలీసులతో నిఘా ఉంచాం
- జిల్లా ఎస్పీ తుషార్ డూడి

సామాజిక మాధ్యమాలు పరిశీలిస్తున్న ఎస్పి తుషార్‌డూడి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వదంతులు వ్యాపింప చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. ఆయన ఆకస్మికంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సోషల్ మీడియా, సైబర్ సెల్ విభాగాలను, డీపీఓలోని వివిధ విభాగాలను గురువారం తనిఖీ చేశారు. రెచ్చగొట్టే విధంగా వార్తలను సోషల్ మీడియా వేదికగా వ్యాపింప చేసే వారిని వేగంగా గుర్తించాలని సోషల్ మీడియా సెల్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితులను దష్టిలో ఉంచుకొని ప్రతి సామాజిక మాధ్యమాన్ని, గ్రూపులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. విద్వేషపూరితమైన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా పోస్ట్ చేసే వారిని గుర్తించి వారి పూర్తి స్థాయి వివరాలు సేకరించి సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ద్వారా వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం డీపీఓలోని వివిధ విభాగాలను తనిఖీ చేశారు. డీపీఓలో పోలీస్ అధికారులకు, సిబ్బంది జీతభత్యాలు, టిఎలు, ఇంక్రిమెంట్‌లు, ప్రమోషన్లు మొదలైన ఫైల్స్ సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. సర్వీస్ బుక్కులు, ఇతర అన్ని రకాల రిజిస్టర్స్‌ను అప్ టు డేట్‌గా ఉంచాలని అన్నారు. పోలీసు సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఇతర శాఖలకు సంబంధించిన రిప్లైలను త్వరితగతిన పంపించాలని అన్నారు. పోలీస్ సిబ్బందికి సంబంధించిన ఫైల్స్ పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సోషల్ మీడియా మాధ్యమాలపై సైబర్ సెల్, సోషల్ మీడియా పోలీసులతో నిరంతర నిఘా ఉంచామన్నారు. ఏదైనా మెసేజ్ ఫార్వర్డ్ చేసేముందు అది వాస్తవమైనదా కాదా అని నిర్ధారణ చేసుకున్న తర్వాత మాత్రమే పోస్ట్ చేయాలని సూచించారు. ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్ట్ చేస్తే సంబంధిత గ్రూప్ అడ్మిన్, నిర్వాహకులు వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. లేనట్లయితే గ్రూప్ అడ్మిన్లు, నిర్వహకులు బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎఓ శ్రీనివాసరావు, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ జయ కుమార్, ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

డిపిఒ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి తుషార్‌డూడి

మాట్లాడుతున్న ఉపకులపతి ఆర్ శారద విజయలక్ష్మిదేవి

ఖండాంతరాల ఖ్యాతి ఆర్జించిన వ్యవసాయ కళాశాల

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల వ్యవసాయ కళాశాల ఎందరో వ్యవసాయ నిపుణులను రాష్ట్రానికేగాక దేశ, విదేశాలకు అందించి బాపట్ల వ్యవసాయ కళాశాల ఖ్యాతిని ఖండాంతరాల్లో ఇనుమడింప జేసిందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆర్ శారద జయలక్ష్మి దేవి అన్నారు. కళాశాల ప్రాంగణంలో గురువారం జరిగిన కళాశాల 80వ వార్షికోత్సవ వేడుకలకు ఆమె హాజరై మాట్లాడారు. హైదరాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ డైరెక్టర్ తారా సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు పెంపొందించాలని పేర్కొన్నారు. ఎన్నో వ్యవసాయ పరిశోధనలకు ఈ కళాశాల వేదికైందని అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న ఆహార అవసరాలకు అనుగుణంగా కొత్త వంగడాలను రూపొందించడంలో ఇక్కడి పరిశోధనలు ఎంతగానో ఉపయోగపడ్డాయని అన్నారు. ఇక్కడ జరిగిన వ్యవసాయ పరిశోధనలు వ్యవసాయ రంగంలో మంచి మార్పు తీసుకొచ్చాయని అన్నారు. ఎంతో మంది విద్యార్థులకు భవిష్యత్తును ఇచ్చిందని అన్నారు. ఏప్రిల్ 17 నుండి 30 వరకు జరిగిన సాహిత్య, క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అదజేశారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ చెరుకూరి శ్రీనివాసరావు, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ ఎవి రమణ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసూనరాణి, హాలో సార్ అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు టిడిపి విస్తృత సమావేశం

ప్రజాశక్తి - బట్టిప్రోలు

స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు తెలుగుదేశం విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం జరుగుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశంలో గ్రామ కమిటీలు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇంచార్జిల నియామకం జరుగుతుందని తెలిపారు. శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమానికి అన్ని గ్రామాల తెలుగుదేశం నాయకులు పాల్గొనాలని కోరారు.

కుట్టుమిషన్ల పంపిణీ అవినీతిపై విచారణ

ప్రజాశక్తి - చీరాల

టిడిపి కూటమి ప్రభుత్వం బీసీ మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ, మిషన్ల పంపిణీ సెంటర్లో అవినీతి జరిగిందని, దీనిపై పూర్తిగా విచారణ చేయాలని వైసిపి నేతలు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి పట్టణ అధ్యక్షులు యాతం మేరి బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ తరగతులు, కుట్టు మిషన్ పంపిణీ లక్ష మంది మహిళలకు ప్రభుత్వం టెండర్ పిలిచిందని, ఒక్కొక్క లబ్ధిదారునికి టెండర్లో రూ.23 వేలు కేటాయించారని అన్నారు. అయితే టెండర్ మొత్తం రూ.230 కోట్లు కాగా ఒక వ్యక్తి ట్రైనింగుకు కాంట్రాక్ట్ ఔట్సోర్స్‌కు ఇచ్చింది రూ.3వేలని కుట్టు మిషన్ కొనుగోలు ఖరీదు రూ.4300 కాగా మొత్తంగా ఒక బీసీ లబ్ధిదారునికి కుట్టు మిషన్, శిక్షణకు అయ్యే ఖర్చు రూ.7300 అవుతుందని అన్నారు. అయితే టెండర్ విలువ రూ.230 కోట్లని సాధారణంగా అయ్యే ఖర్చు రూ.73 కోట్లు కాగా వృధా అవుతున్న ప్రభుత్వం ధనం రూ.167 కోట్లు అన్నారు. ఈ టెండర్‌ను శ్రీ టెక్నాలజీ ఎల్ 1ను కూటమి ప్రభుత్వానికి సంబంధించిన ఇద్దరు వ్యక్తుల కంపెనీలకు దక్కించుకున్నారని అన్నారు. కావున ఈ కుట్టుమిషన్ల పంపిణీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు సాగు రాఘవ, వైసిపి వేటపాలెం మండలం అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, వైసిపి యువజన విభాగ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ప్రసాదరెడ్డి, వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి పాల్గొనినారు.

వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

మహిళల సంక్షేమానికి కార్యాచరణ

ప్రజాశక్తి - కర్లపాలెం

స్వయం సహాయక సంఘాల మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టినదని ఎంపిడిఓ అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. స్టానిక మండల సమాఖ్య కార్యాలయంలో విఓఎలకు వార్షిక జీవనోపాదుల రుణప్రణాలికపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి కుటుంభంలో ఒక మహిళా వ్యాపారవేత్త లేదా పారిశ్రామిక వేత్తను తయారు చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. ప్రభుత్వ మన్ననలు పొందిన మహిళా సంఘాలు పి4 బంగారు కుటుంభాలను పేదరికం నుండి బయటికి తీసుకురావటంలో తమవంతు సహకారం అందించాలని కోరారు. ఎపిఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రీయ పేదరిక నిర్మోలనా సంస్థ సూచనల మేరకు కూటమి ప్రబుత్వం కలను నిజం చేయటానికి ప్రత్యేక స్వయంసహాయక బృందాలద్వారా వినూత్న పద్ధతిలో 13500 కుటుంభాలకు జీవనోపాదుల వార్షిక ప్రణాళిక చేయటం జరిగినదని తెలిపారు. ఏ నేలలో ఏ కార్యక్రమానికి ఎంత ఋణం అవసరం అవుతుందని, ఎలాంటి శిక్షణలు కావాలని, వ్యవసాయ, వ్యవసాయేతర, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో మక్కువ ఉన్నవారిని గుర్తించినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపిడిఓ అద్దూరి శ్రీనివాసరావు

వీరికి 12నుండి మండలంలో కమ్యునిటీ కో ఆర్డినేటర్ బృందాలు మైక్రోక్రెడిట్ ప్లాన్ చేయటం ద్వారా వారి అవసరాలుకు తగ్గట్లు అవసరమైనంత మొత్తం పొదుపులు, స్త్రీ నిది, వున్నతి, పిఎంఈజిపి, పిఎంఎఫ్ఎంఈ, స్టాండ్ ఆఫ్ ఇండియా, ఎంఎస్ఎంఈ బ్యాంకు అనుసందాన రుణ ప్రణాలిక రూపొందించి జీవనోపాది అవసరాలుకు అవసరమైన మొత్తం అందించి సంఘాలు మైక్రో ఫైనాన్సు బారిన పడకుండా చూడటం జరుగుతుందని అలాగే వారికి వివిధ శిక్షణలు ఇచ్చి ప్రతి ఇంటికి ఒక పారిశ్రామిక, వ్యాపార వేత్తగా చేసి తలసరి ఆదాయం పెంచటం ద్వారా ప్రభుత్వ కల నిజం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సిహెచ్ ధనలక్ష్మి, అకౌంటేంట్ లక్ష్మి, విఓఎలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్పి మొయిన్

తిరుణాళ్లకు కట్టుదిట్టమైన భద్రత

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక పొలిమేర ఆంజనేయ స్వామి వద్ద ఈ నెల 10, 11, 12 తేదీల్లో తిరునాళ్ల నిర్వహించనున్న సందర్భంగా ఆలయం ఆవరణంలో కమిటీ సభ్యులతో చీరాల డిఎస్పి మహమ్మద్ మోయిన్ గురువారం మావేశం నిర్వహించారు. తిరుణాల సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. చివరి రోజు భక్తులు ఎక్కువగా వస్తారు కాబట్టి ఆ రోజు ప్రభలు, నాటకాలు, వివిధ ఎంటర్టైన్మెంట్ ప్రోగ్రాంలు నిర్వహించే సందర్భంగా కమిటీ వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఏదైనా ఘటనలు, ఘర్షణలు జరిగే సమాచారం ఉంటే ముందుగానే పోలీసులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ రమణయ్య తోపాటు ఎస్ఐ జి సురేష్ భక్తులకు సూచనలు చేశారు.

నక్క విజయ్ వివాహ వేడుకల్లో నాయకులు

పిఎ వివాహ వేడుకల్లో ఆనందబాబు

ప్రజాశక్తి - వేమూరు

శాసన సభ్యులు నక్కా ఆనందబాబు పిఏగా వ్యవహరిస్తున్న నక్క విజయ్ వివాహ వేడుకలు శుక్రవారం తెనాలిలోని రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో గురువారం జరిగింది. ఈ వివాహ వేడుకల్లో శాసన సభ్యులు నక్కా ఆనందబాబు తోపాటు పలువురు జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, వేమూరు, చుండూరు, బట్టిప్రోలు, కొల్లూరు, అమృతలూరు మండలాల నుండి వివిధ శాఖల అధికారులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

జిల్లా పరిషత్ ఛైర్మన్‌తో మండల నాయకులు

అభివృద్ధికి జడ్పీ నిధులు ఇవ్వాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల అభివృద్ధికి అవసరమైన మేర జిల్లా పరిషత్తు నిధులను మంజూరు చేసి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని టిడిపి మండల నాయకులు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు ఛైర్మన్ కత్తెర హేన క్రిస్టియనాను కోరారు. గురువారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈపాటికే ప్రభుత్వం అధ్వాన్నంగా ఉన్న రహదారులను అభివృద్ధి పరుస్తుందని తెలిపారు. దీనితోపాటు జిల్లా పరిషత్‌కు చెందిన రహదారులు, డొంకలు ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న దృష్ట్యా వాటికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పరచాలని కోరారు. గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్‌కు సంబంధించిన ఆస్తులను పరిరక్షించేందుకు అధికారులు, నాయకులు దృష్టి సారించి కాపాడాలని కోరారు. జిల్లా పరిషత్తులు నిధుల లభ్యతను బట్టి మండల అభివృద్ధికి సహకరిస్తానని ఆమె భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి కార్యవర్గ కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్, భట్టిప్రోలు నీటి సంఘం అధ్యక్షులు వై కరుణ శ్రీనివాసరావు, ఎస్‌సి సెల్ నాయకులు కనపర్తి సుందర్రావు, జంగం సాంసన్, బుజ్జి పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆలోచనలు అనుసరణీయం

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి
- ఆకట్టుకున్న 'బుద్ధం శరణం గచ్ఛామి' నాటకం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచనలు ప్రపంచ దేశాలు అనుకరిస్తుంటే దేశంలో బిజెపి ప్రభుత్వం తీవ్రంగా అవమానిస్తోందని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి విమర్శించారు. గురువారం రాత్రి స్థానిక అంబేద్కర్ భవన్‌లో హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ 'బుద్ధం శరణం గచ్ఛామి' నాటక ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి రాజ్యాంగం మార్చే దిశగా అడుగులు వేస్తున్న దశలో రాజ్యాంగం కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పించడానికి అంబేద్కర్ నాటక ప్రదర్శన రాష్ట్రవ్యాప్తంగా కెవిపిఎస్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 22న కర్నూల్ జిల్లాలో ప్రారంభించిన నాటకం 753 ప్రదర్శనగా ఒంగోలులో ప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు. దేవేంద్ర రచనలో తూము శివప్రసాద్ దర్శకత్వంలో చేపట్టిన ప్రదర్శన ఈ నెల 18న విజయవాడలో ముగుస్తుందన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి బి.రఘురామ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రారంభం సూచనగా రిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్.సుధాకర్‌రావు, డిఇఇ సుధీర్‌లతో కలసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తొలుత అంబేద్కర్ భవన్ వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు, జిల్లా అధ్యక్షులు జవ్వాజి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, వేశపోగు మోజెస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, కెవిపిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జాలా అంజయ్య, ఉద్యోగ నేతలు శ్యాంకుమార్, గడ్డం మాల్యాద్రి, ఏపిఎం గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆండ్ర మాల్యాద్రి

నాటకంలోని ఓ సన్నివేశం

అంబేద్కర్ జీవితం.. పెన్సిల్ లెడ్‌పై చిత్రీకరణ..

చీరాలకు చెందిన విద్యార్థి మహతి డాక్టర్ అంబేద్కర్ జీవితాన్ని పెన్సిల్ లెడ్‌పై లిఖించిన సూక్ష్మ రూపకాన్ని నిర్వాహకులు ఆవిష్కరణ గావించి.. అభినందనలు తెలిపారు. ప్రపంచంలో మొదటిసారి చేసిన ఆమె ప్రయత్నాన్ని పలువురు అభినందించారు. ఆమె రాసిన జీవిత గ్రంథాన్ని అంబేద్కర్ మనుమడికి అందిస్తామని కెవిపిఎస్ నిర్వాహకులు ప్రకటించారు.

అలరించిన అంబేద్కర్ నాటకం..

దేవేంద్ర రచనలో తూము శివప్రసాద్ దర్శకత్వం లో చేపట్టిన నాటక ప్రదర్శన వీక్షకులను అలరించింది. నాటకంలో నటించిన నటీనటులు ఆయా పాత్రలకు జీవం పోశారు. ప్రతి సన్నివేశం వీక్షకులను ఆలోచింపజేసింది.

పొగాకుకు గిట్టుబాటు ధర ఇవ్వటమే లక్ష్యం

వేలం కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పొగాకు పంటకు గిట్టుబాటు ధర రావాలనేది ప్రభుత్వం లక్ష్యమని కలెక్టర్ ఎ.తమీమ్‌అన్సారియా పేర్కొన్నారు. స్థానిక త్రోవగుంటలోని ఒంగోలు వేలం కేంద్రం-2ను కలెక్టర్ గురువారం సందర్శించి.. వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతుల వద్ద నుండి పొగాకు కొనుగోలు విధానాన్ని పరిశీలించి పొగాకు బోర్డు ఆర్ఎం, వేలం నిర్వహణ అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ ఎన్ని ఎకరాల్లో పొగాకు పంట వేశారు.? ఎకరాకు ఎంత దిగుబడి వచ్చింది.? కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.? అని అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం కౌలు, కూలి రేట్లు పెరిగాయని, గిట్టుబాటు ధర లేక పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్నారని వారు తెలిపారు. పొగాకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదని, రైతులు తెచ్చిన బేళ్లను నోబిడ్ చేయకుండా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని పొగాకు రైతులు ఈ సందర్భంగా కలెక్టర్ దష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలుగకుండా పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావాలనేది ప్రభుత్వం లక్ష్యమని, అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు, వేలం కేంద్ర సూపరింటెండెంట్ తులసి, ఒంగోలు రూరల్ తహశీల్దార్ ప్రసాద్, పొగాకు రైతులు పాల్గొన్నారు.

పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

13వ తేదీకి 'మీ కోసం' మార్పు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో ఈ నెల 12న జరగాల్సిన మీకోసం కార్యక్రమాన్ని 13వ తేదీకి మార్చినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న సోమవారం జిల్లా సమీక్షా మండలి సమావేశం(డిఆర్‌సి) ఉండటంతో మీకోసం కార్యక్రమాన్ని మార్చామన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి 13న మంగళవారం జరిగే కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తనిఖీలలో ఎస్పీ దామోదర్

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

జిల్లావ్యాప్తంగా పలు ప్రదేశాలు, వాహనాలను పోలీసులు గురువారం తనిఖీ చేశారు. ఒంగోలులో ఎస్పీ దామోదర్, పోలీసు అధికారులు పలు ప్రదేశాలలో తనిఖీలు చేపట్టారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, అద్దంకి బస్టాండ్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో వాహన తనిఖీ చేపట్టారు.